సాక్షి
రంగారెడ్డి

శుక్రవారం ; 19 ; జనవరి ; 2024



పర్యాటక క్షేత్రంగా జేపీదర్గా

కొత్తూరు మండలం ఇన్ముల్‌నర్వ గ్రామం లోని జేపీదర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. 8లో▸



ప్రియుడిని ప్రేరేపించి..

వివాహేతర సంబంధం ఓ వ్యక్తిని బలి తీసుకుంది. భార్య ప్రియుడితో కలిసి భర్తను హతమార్చింది. 8లో▸



అప్‌డేట్‌కు ఇదీ 'వరుస'

ఆధార్ అప్‌డేట్ కోసం జనం నానా పాట్లు పడుతున్నారు. ఉదయాన్నే చెప్పులు క్యూలో ఉంచి ఎదురుచూస్తున్నారు. 8లో▸

న్యూస్‌రీల్

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

మహేశ్వరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.సంగి రమేష్ పేర్కొన్నారు. కళాశాలలో తెలుగు, ఇంగ్లిష్, కామర్స్, కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టుల్లో బోధించేందుకు పీజీలో 55 శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీలు 50 శాతం మార్కులు కలిగి ఉండాలని తెలిపారు. పీహెచ్‌డీ, ఎన్‌ఈటీ, ఎస్‌ఈటీ, బోధన అనుభవం కలిగిన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు ఈ నెల 22వ తేదీ సాయంత్రం 4గంటల లోపు కళాశాలలోని కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు. వివరాలకు 94404 47737 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

నేడు మంతన్‌గౌరెల్లిలో భూ న్యాయ శిబిరం

యాచారం: మండల పరిధిలోని మంతన్‌గౌరెల్లిలో శుక్రవారం ఉదయం 9 గంటలకు భూ న్యాయ శిబిరం నిర్వహిస్తున్న లీఫ్స్ సంస్థ అధ్యక్షుడు డాక్టర్ సునీల్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భూ సమస్యలున్న రైతులు తాము ఇచ్చే భూ న్యాయ వివరాల ప్రతిలో పూర్తి వివరాలు నమోదు చేసి ఇస్తే త్వరగా పరిష్కారమయ్యేలా కృషి చేస్తామని అన్నారు. ఈ భూ న్యాయ శిబిరానికి ధరణి పునర్నిర్మాణ కమిటీ సభ్యులు ముదిరెడ్డి కోదండరెడ్డి, వి.లచ్చిరెడ్డి హాజరవుతున్నట్లు తెలి పారు. మంతన్‌గౌరెల్లిలో భూ న్యాయ శిబిరం ప్రారంభించిన అనంతరం మధ్యాహ్నం 2 గంటలకు మండలంలోని మిగతా 23 గ్రామాల భూ న్యాయ శిబిరాల నిర్వహణ వలంటీర్లతో సమావేశం ఉంటుందన్నారు.

ఫిషరీస్ సొసైటీ జిల్లా కన్వీనర్‌గా మన్నె వెంకటేశ్



నియామకపత్రం అందుకుంటున్న మన్నె వెంకటేశ్ ముదిరాజ్

శంకర్‌పల్లి: ఫిషరీస్ సొసైటీ జిల్లా కన్వీనర్‌గా మండలంలోని మోకిల గ్రామానికి చెందిన మన్నె వెంకటేశ్ ముదిరాజ్ నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం నగరంలోని కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నికైన ఆయనకు ఫిషరీస్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు పిట్టల రవీందర్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవిని అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

గురుకులంలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

షాద్‌నగర్: మైనార్టీ గురుకుల పాఠశాలలో ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు షాద్‌నగర్ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాల ప్రిన్సిపాల్ జీఎస్ స్వప్న పేర్కొన్నారు. షాద్‌నగర్ పరిధిలోని నాగులపల్లి గ్రామ శివారులో ఉన్న మైనార్టీ గురుకుల పాఠశాలలో 6 నుంచి 9వ తరగతి వరకు ప్రవేశాలకు ముస్లిం, క్రిస్టియన్, పార్సీ, జైన్, సిక్కులతో పాటు, మైనార్టీయేతర ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. 6వ తరగతిలో 17 సీట్లు, 7వ తరగతిలో 15 సీట్లు, 8వ తరగతిలో 6 సీట్లు, 9వ తరగతిలో 20 సీట్లు ఉన్నట్లు చెప్పారు. ఆసక్తి గల విద్యార్థులు ఫిబ్రవరి 6వ తేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాలకు పాఠశాలలో సంప్రదించాలని సూచించారు.

మైనార్టీ గురుకులాల్లో ..

ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం ప్రభుత్వ మైనార్టీ గురుకుల పాఠశాల, కళాశాలలో 2024–25 విద్యా సంవత్సరంలో 5వ తరగతి, ఇంటర్ ఫస్టియర్‌లో ప్రవేశానికి ఫిబ్ర వరి 6వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ వజ్రమ్మ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 6,7,8 తరగతుల్లో, ఇంటర్ సెకండియర్ ఎంపీసీ, బైపీసీ గ్రూప్‌ల్లో ఖాళీగా ఉన్న సీట్లను కూడా భర్తీ చేయనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాలకు 99897 52088, 78939 92015 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఈనెల 20 వరకు..

ఇబ్రహీంపట్నం రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయ సంస్థ ఐదో తరగతిలో ప్రవేశాల కోసం విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ఆదిబట్ల ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు వర్కాల పరమేష్ పేర్కొన్నారు. ఈ నెల 20వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు.

పాలన ప్రత్యేకమే..

ఫిబ్రవరి 1తో ముగియనున్న సర్పంచుల పదవీకాలం

- స్థానిక సంస్థలకు ఇప్పట్లో ఎన్నికలు లేనట్లే..
- ప్రత్యేక అధికారులవైపే ప్రభుత్వం మొగ్గు
- ఆశావహులకు తప్పని ఎదురుచూపులు



సాక్షి, రంగారెడ్డిజిల్లా: మరికొద్ది రోజుల్లో సర్పంచుల పదవీ కాలం ముగియనుంది. స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించే అంశంపై ఎన్నికల కమిషన్ ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. నోటిఫికేషన్‌కు మరింత ఆలస్యం అయ్యే అవకాశం కనిపిస్తోంది. జిల్లాలో 27 మండలాలు ఉండగా, వీటిలో ఆరు మండలాలు పూర్తిగా అర్బన్ ఏరియాలో ఉన్నాయి. 21 మండలాల పరిధిలో 558 గ్రామ పంచాయతీలు ఉండగా, వీటికి 2019 జనవరి 1న ఎన్నికల షెడ్యూల్ విడుదలైంది. జనవరి 21న మొదటి విడత, 25న రెండు, 30న మూడో విడతగా మొత్తం మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి 2న సర్పంచులు, వార్డు సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. తాజాగా వీరి పదవీకాలం ముగియడం, ఎన్నికలకు మరింత సమయం పట్టే అవకాశం ఉండటంతో ఆయా గ్రామ పంచాయతీలన్నీ ప్రత్యేక అధికారుల పాలనలోకి వెళ్లే అవకాశం ఉంది. ఉమ్మడి ఏపీలో (2005, 2011) అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచుల పదవీకాలం ముగిసిన తర్వాత ప్రత్యేక అధికారులను నియమించింది.

పర్సన్ ఇన్‌చార్జిలకు అవకాశం లేనట్లే..

నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం నిర్దేశిత గడువులోగా ఎన్నికలు నిర్వహించాల్సిందే. లేని పరిస్థితుల్లో ప్రత్యేకాధికారులను నియమించి, పల్లె పాలన కొనసాగించాల్సి ఉంది. పదవీకాలం పూర్తయిన తర్వాత ఆయా పాలక వర్గాలను పర్సన్ ఇన్‌చార్జిలుగా నియమించేందుకు కొత్త చట్టం అనుమతించదు. ఒక వేళ వారిని అనుమతించాలంటే అసెంబ్లీలో చట్ట సవరణ లేదా ఆర్డినెన్స్ తీసుకురావాల్సి ఉంది. అంతేకాదు ప్రస్తుత సర్పంచుల్లో మెజార్టీ సభ్యులు బీఆర్‌ఎస్ నేతలే ఉన్నారు. వీరిని కొనసాగించేందుకు ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆసక్తి చూపించకపోయినా ప్రత్యేకాధికారుల పాలనకే మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది.

21 మండలాల పరిధిలో ఓటర్లు

ఎస్టీ	71,175
ఎస్సీ	1,47,248
బీసీ	3,72,356
ఇతరులు	98,484

రిజర్వేషన్లపై సందిగ్ధత..

పదేళ్ల పాటు రిజర్వేషన్లు ఉండేలా అప్పట్లో నూతన పంచాయతీరాజ్ చట్టంలో పొందుపర్చారు. 2018లో ఎన్నికలు నిర్వహించిన సమయంలో నిర్దేశించిన రిజర్వేషన్లు పదేళ్ల పాటు అమల్లో ఉంటాయని వెల్లడించారు. ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు పెంచుతామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. బీసీ గణన చేపట్టి ఆయా గణాంకాల ఆధారంగా రిజర్వేషన్లు కల్పిస్తామని తెలిపింది. దీనికి తోడు నూతన పంచాయతీల సంఖ్య పెరిగిన నేపథ్యంలో రిజర్వేషన్ల మార్పు అనివార్యంగా కన్పిస్తోంది. ఈ విషయంపై ప్రభుత్వం ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోక పోవడంతో సందిగ్ధత నెలకొంది. అంతే కాదు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే అవకాశం లేక పోవడంతో ఆశావహులకు నిరాశే ఎదురవుతోంది.

మండలస్థాయి అధికారులతో..

గ్రామ పంచాయతీలకు మండల స్థాయి ప్రత్యేక అధికారులను నియమించాలని నిర్ణయించినట్లు విశ్వసనీయ సమాచారం. లోక్‌సభ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో భాగస్వామ్యం లేని విభాగాలకు చెందిన అధికారులను ఇందుకు ఇన్‌చార్జిలుగా నియమించాలనే యోచన చేస్తున్నట్లు తెలిసింది. మండల పరిషత్ సూపరింటెండెంట్, ఎంపీఓ, వ్యవసాయశాఖ, పశు సంవర్థకశాఖ, ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన ఏఈలను నియమించనున్నట్లు వినికిడి. మేజర్ పంచాయతీలకు జిల్లాస్థాయి అధికారులను నియమించే అవకాశాన్ని పరిశీలిస్తున్నారు. ఇదిలా ఉండగా కోవిడ్ కారణంగా రెండేళ్ల పదవికాలాన్ని కోల్పోయామని.. ఈ మేరకు తమ పదవీ కాలన్నీ మరో రెండేళ్ల పాటు పొడిగించాలనే డిమాండ్ కూడా సర్పంచ్‌ల నుంచి వ్యక్తమవుతోంది.

ఏకగ్రీవ పంచాయతీలకు..

జిల్లాలో ఏకగ్రీవంగా ఎన్నికైన గ్రామ పంచాయతీలు 43 ఉన్నాయి. ప్రోత్సాహక బహుమతిగా రూ.10 లక్షల వరకు ఇవ్వనున్నట్లు గత ప్రభుత్వం ప్రకటించింది. ఇప్పటి వరకు ఆయా గ్రామ పంచాయతీలకు ఒక్క పైసా కూడా విదల్చక పోవడం విశేషం. అంతేకాదు 14వ ఫైనాన్స్ కమిషన్, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ గ్రాంట్ల కింద కూడా ఆశించిన స్థాయిలో నిధులు రాలేదు. దీంతో ఇప్పటి వరకు ఆయా గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ కాల్వలు, ఇతర అభివృద్ధి పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు బిల్లుల కోసం ఏళ్ల తరబడి కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది.

ప్రభుత్వ భూముల పరిరక్షణే ధ్యేయం

- నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటాం
- ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిలా పని చేస్తాం
- లబ్ధిదారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం
- విధి నిర్వహణలో నిర్లక్ష్యం సహించేది లేదు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ శశాంక



సాక్షి, రంగారెడ్డిజిల్లా: 'ప్రభుత్వ ఆలోచనకు అనుగుణంగా పని చేయడంతో పాటు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా. జిల్లా ప్రజలకు పారదర్శకమైన పాలనను అందించేందుకు కృషి చేస్తా' అని కలెక్టర్ శశాంక తెలిపారు. ఆయన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా 'సాక్షి'కి ఇంటర్వ్యూ ఇచ్చారు. ప్రభుత్వం ఏ లక్ష్యం కోసమైతే తనను జిల్లా కలెక్టర్‌గా నియమించిందో ఆ లక్ష్యానికి అనుగుణంగా పని చేస్తానని జిల్లాకు మంచి గుర్తింపు తీసుకొస్తానని ఆయన స్పష్టం చేశారు. ఇంకా చెప్పారో ఆయన మాటల్లోనే..

నిర్లక్ష్యాన్ని ఉపేక్షించబోను

గ్రామీణ జిల్లాలతో పోలిస్తే రంగారెడ్డి కొంత భిన్నమైంది. ఇది పూర్తిగా అర్బన్ ప్రాంతం. నగరానికి ఆనుకుని ఉండటంతో ప్రతి ఒక్కరి దృష్టి ఈ జిల్లాపైనే ఉంటుంది. భూముల ధరలతో పాటు వివాదాలు అదే స్థాయిలో ఉంటాయి. విలువైన ఈ ప్రభుత్వ భూముల పరిరక్షణ కలెక్టర్‌గా నాకో పెద్ద టాస్క్. ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం ప్రత్యేక చర్యలు చేపడతా. రెవెన్యూ సహా జిల్లాలోని అన్ని విభాగాల్లోని అధికారుల పనితీరుపై ప్రత్యేకంగా దృష్టి సారిస్తా. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులను ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం.

వివాదాలకు ఆస్కారం ఇవ్వబోం

భూ సంబంధిత సమస్యల పరిష్కారం కోసం ధరణి పోర్టల్‌కు వచ్చే ప్రతి దరఖాస్తును క్షుణ్నంగా పరిశీలిస్తాం. ప్రస్తుతం వివాదాస్పద దరఖాస్తుల జోలికి వెళ్లడం లేదు. సాధారణ మ్యూటేషన్లు, ఆధార్ నమోదు, పేర్ల నమోదులో దొర్లిన తప్పులను సరి చేయడం వంటి చిన్న చిన్న సమస్యలను మాత్రమే పరిష్కరిస్తున్నాం. ప్రభుత్వం నుంచి స్పష్టమైన ఆదేశాలు వచ్చిన తర్వాతే నిషేధిత జాబితాలోని భూముల గురించి ఆలోచిస్తాం. భూ సమస్యల పరిష్కారంలో ఎలాంటి వివాదాలు తలెత్తకుండా అత్యంత జాగ్రత్తగా వ్యవహరిస్తాం.

నిబంధనల మేరకే అవిశ్వాస తీర్మానాలు

జిల్లాలోని పలు మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల సభ్యులు అవిశ్వాస తీర్మాణం కోసం నోటీసులు అందించారు. నిబంధనల ప్రకారం ఇచ్చిన నోటీసులను పరిగణలోకి తీసుకుని, ఆ మేరకు నోటీసులు ఇచ్చిన తర్వాత 30 రోజుల్లో నిర్ణయం తీసుకుంటాం. సమావేశాలు ఏర్పాటు చేసి, కొత్త పాలక మండళ్ల ఏర్పాటుకు అవకాశం కల్పిస్తాం. మున్సిపల్ చట్టాలను తూచా తప్పకుండా అమలు చేస్తాం. ఇందులో ఎలాంటి అనుమానం అక్కర లేదు.

అర్హులకే సంక్షేమ ఫలాలు

ఇటు ప్రభుత్వానికి, అటు ప్రజలకు మధ్య ఓ వారధిలా వ్యహరించి, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి ఫలాలను అర్హులకు అందించేందుకు కృషి చేస్తా. ఆరు గ్యారంటీల పథకంలో భాగంగా ఇప్పటి వరకు అందిన ప్రతి దరఖాస్తును ఆన్‌లైన్‌లో భద్రపరిచాం. అర్హుల ఎంపికలో రాజకీయ జోక్యంతో పాటు దళారుల ప్రమేయం లేకుండా జాగ్రత్త వహిస్తాం. నిజమైన లబ్ధిదారునికి ప్రభుత్వ పథకాలు అందేలా చూస్తాం.



ఆమనగల్లులోని ఓ ఫర్టిలైజర్ షాపులో తనిఖీ చేస్తున్న జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి

స్టాకు వివరాలు పక్కాగా ఉండాలి

- జిల్లా వ్యవసాయాధికారి గీతా రెడ్డి

ఆమనగల్లు: ఫర్టిలైజర్స్, ఎరువుల షాపుల డీలర్లు ఎప్పటికప్పుడు స్టాకు వివరాలను ఈ పాస్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి గీతారెడ్డి సూచించారు. నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆమనగల్లు పట్టణంలోని పలు ఫర్టిలైజర్ షాపులను గురువారం ఆమె తనిఖీ చేశారు. ఆయా దుకాణాల్లో రికార్డులను పరిశీలించారు. స్టాకులను పరిశీలించి యజమానులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా గీతారెడ్డి మాట్లాడుతూ.. ఫర్టిలైజర్స్, ఎరువుల షాపుల డీలర్లు ఈ పాస్‌ను అప్‌డేట్ చేయకపోవడంతో ఇబ్బందులు కలుగుతున్నాయని అన్నారు. ఎరువుల స్టాక్ వచ్చిన సమయంలో వివరాలను ఈ పాస్‌లో నమోదు చేయాలని, ప్రతిరోజు విక్రయించే స్టాక్‌ను ఈ పాస్‌లో నమోదు చేసి తీసివేయాలని ఆమె సూచించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఎరువుల షాపుల యజమానులు విక్రయాలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినా, నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయించినా చట్ట ప్రకారం చర్యలు తప్పవన్నారు. ఆము వెంట మండల వ్యవసాయాధికారి అరుణకుమారి ఉన్నారు.

మేడారానికి ఉచిత ప్రయాణం

- మహిళలకు కొనసాగిస్తాం
- రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- మన్నెగూడలో ఆర్టీఏ కార్యాలయం ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

తుర్కయంజాల్: మేడారం సమ్మక్క సారక్క జాతరకు వెళ్లే మహిళలకు ఉచిత ప్రయాణం కొనసాగుతుందని రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. మున్సిపల్ పరిధిలోని మన్నెగూడలో నూతనంగా నిర్మించిన ప్రాంతీయ రవాణా శాఖ కార్యాలయాన్ని స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డితో కలిసి గురువారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. ప్రతిపక్షాల నాయకులు ఆటో కార్మికులను రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని ధ్వజమెత్తారు. మెట్రో ప్రారంభించిన సమయంలో.. ఓలా, ఊబర్ వంటి సంస్థల ప్రవేశంతో ఆటో కార్మికుల ఉపాధి తగ్గినప్పుడు ప్రశ్నించని వారు నేడు పనికట్టుకుని ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. ప్రజా ప్రభుత్వంలో ప్రతి ఒక్కరి సలహాలు, సూచనలు స్వీకరించి ఆర్టీఏ సేవలను సులభతరం చేస్తామని తెలిపారు. అనంతరం రవాణా శాఖ రూపొందించిన రోడ్ సేఫ్టీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి మాట్లాడుతూ.. సాగర్ హైవే నుంచి నేరుగా కార్యాలయానికి వచ్చేలా రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వ భూమిని కేటాయించాలని కలెక్టర్ శశాంకను కోరారు. ఇందుకు కలెక్టర్ సానుకూలంగా స్పందించి వెంటనే పరిశీలించి రోడ్డు వసతి కల్పిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎమ్మెల్సీలు యెగ్గె మల్లేశం, బొగ్గారపు దయానంద్, మున్సిపల్ చైర్‌పర్సన్ మల్‌రెడ్డి అనురాధ, వైస్ చైర్‌పర్సన్ గుండ్లపల్లి హరిత, ఆర్‌అండ్‌బీ శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి కేఎస్ శ్రీనివాసరాజు, రవాణాశాఖ కమిషనర్ జ్యోతి బుద్ధ ప్రకాశ్, జిల్లా ఉప కమిషనర్ ఎం.ప్రవీణ్ రావు, ప్రాంతీయ రవాణా అధికారి ఎం.రఘునందన్‌గౌడ్, కౌన్సిలర్ మర్రి మాధవి తదితరులు పాల్గొన్నారు.



బర్కకృష్ణ యాదవ్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న జవాజి రమేష్‌యాదవ్

బహుజనుల రాజ్యం వస్తేనే అభివృద్ధి

బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ యాదవ్

షాబాద్: బహుజనుల రాజ్యం వస్తేనే అభివృద్ధి సాధ్యమని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ యాదవ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని పీఆర్‌ఆర్ మినీ స్టేడియంలో గురువారం బీసీ సేన మండల అధ్యక్షుడిగా జవాజి రమేష్‌యాదవ్‌ను నియమించి నియమక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణ యాదవ్ మాట్లాడుతూ.. బహుజనుల లక్ష్యం రాజ్యాధికారమేనని, ఇందుకోసం అందరూ పోరాడాలని పిలుపునిచ్చారు. బహుజనులను అణగదొక్కుతూ సాగుతున్న దొరల పాలనకు చరమగీతం పాడే రోజులు సమీపంలో ఉన్నాయన్నారు. రాష్ట్రంలో 5 శాతం జనాభా కూడా లేనివారు స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి సీఎం పదవులు అనుభవిస్తుంటే 90 శాతానికి పైగా జనాభా ఉన్న బహుజనులు మాత్రం ఇప్పటికీ ఎమ్మెల్యే, మంత్రి పదవుల కోసం భిక్షమెత్తుకోవాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. వీటన్నింటికీ పరిష్కారం బహుజనులు రాజ్యాధికారంలోకి రావడమేనన్నారు. కార్యక్రమంలో నాయకులు చందు, శ్రీశైలం, సతీష్, రవి కుమార్, మునురూ శ్రీను, యాదయ్య, జంగయ్య, కుమార్, యాదగిరి తదితరులు ఉన్నారు.

ఓటరు జాబితా సవరణకు సహకరించండి

- రాజకీయపార్టీల ప్రతినిధులతో కలెక్టర్ శశాంక



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఓటరు జాబితా సవరణ పకడ్బందీగా జరిగేలా రాజకీయపార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ కె.శశాంక కోరారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని సమావేశ మందిరంలో గురువారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. స్పెషల్ సమ్మరీ రివిజన్ లో భాగంగా ఈనెల 6న ఓటర్ డ్రాఫ్ట్ జాబితా ప్రచురితమైందని, క్లైమ్స్, అభ్యంతరాలకు ఈనెల 22 వరకు అవకాశం ఉందని తెలిపారు. డూప్లికేట్, చనిపోయిన వారి పేర్లు తొలగించాలని, అర్హులను ఓటరు జాబితాలో నమోదు చేయించాలని సూచించారు. ఒక చోట నుంచి మరో చోటికి మారిన ఓటర్ల ఫారం 8 ద్వారా దర ఖాస్తు చేసుకోవాలని, అందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు.

సమన్వయంతో సవరణ

రాజకీయ పార్టీలు బూత్ స్థాయిలో ఏజెంట్లను నియమించుకోవాలని, ప్రస్తుతం ఉన్న పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ, కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉంటే తెలపాలని అన్నారు. 1,450 పైచిలుకు ఓటర్లు కలిగిన చోట కొత్త పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ప్రతిపాదించడం జరుగుతుందని తెలిపారు. నియోజకవర్గాల వారీగా ప్రతివారం రాజకీయ పార్టీల సమావేశాలు నిర్వహించి అన్ని విషయాలను తెలియజేస్తున్నామన్నారు. జిల్లా స్థాయిలో కూడా ప్రతి వారం ఆయా రాజకీయ పార్టీల నేతలతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

స్పెషల్ క్యాంపెయిన్ డేస్

ఈ నెల 20, 21 తేదీల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో స్పెషల్ క్యాంపెయిన్ డేస్ నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితాతో బీఎల్‌వోలు అందుబాటులో ఉంటారన్నారు. 18 ఏళ్లు పైబడిన వారు కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపొందించేలా రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. అసెంబ్లీ ఎన్నికల మాదిరే లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతమైన వాతావ రణంలో నిర్వహించాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, జిల్లా రెవెన్యూ అధికారి సంగీత పాల్గొన్నారు.

ప్రియుడిని ప్రేరేపించి.. భర్తను హతమార్చి



సమావేశంలో నిందితులను చూపుతున్న పోలీసులు

- కొండారెడ్డిపల్లిలో దారుణం
- కేసును ఛేదించిన పోలీసులు
- నిందితుల రిమాండ్

కేశంపేట: వివాహేతర సంబంధం ఓ వ్యక్తిని బలి తీసుకుంది. భార్య ప్రియుడితో కలిసి భర్తను హత మార్చిన సంఘటన మండల పరిధిలోని కొండారెడ్డి పల్లిలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మిద్దె యాదగిరి ఈ నెల 13న అనుమానాస్పదంగా మృతి చెందారు. అదే రోజు ఆయన తల్లి అమృత ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సమగ్ర దర్యాప్తు చేసి గురువారం నిందితులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు. ఈ సందర్భంగా పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండారెడ్డిపల్లి గ్రామానికి చెందిన యాదగిరి వనపర్తి జిల్లా పీపనగండ్ల మండలం కల్వరాల గ్రామంలో బోరు బండిపై కూలీ పనిచేసేవారు. ఈ నెల 8న గ్రామానికి వస్తున్నట్లు ఆయన భార్య శివలీలకు ఫోన్‌లో తెలిపారు. అప్పటికే వివాహేతర సంబంధం సాగిస్తున్న ఆమె ప్రియుడు ఆంజనేయులుకు సమాచారం ఇచ్చింది. తన భర్తను హత్య చేయాలని ఆమె కోరింది. ప్రియుడు షాద్‌నగర్‌లో యాదగిరిని కలుసుకొని.. ఇద్దరూ కొండారెడ్డిపల్లి చెరువు వద్దకు వచ్చి మద్యం తాగారు. ఇదే అదునుగా భావించి బండరాయితో యాదగిరిని కొట్టి చంపాడు. మూడు రోజుల్లోనే నిందితులను గుర్తించి కేసును ఛేదించడంతో పోలీసు ఉన్నతాధికారులు సీఐ రామిరెడ్డి, ఎస్‌ఐ వరప్రసాద్, క్రైమ్ కానిస్టేబుల్ శివకుమార్, రవి, అశోక్‌కుమార్‌రెడ్డి అభినందించారు.

కారు ప్రమాదానికి కారణమైన మైనర్‌తో పాటు తండ్రిపై కేసు

బంజారాహిల్స్: అతివేగంగా కారు నడుపుతూ ప్రమాదానికి కారణమైన ఘటనలో మైనర్‌తో పాటు కారు ఇచ్చిన తండ్రిపై జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాల్లోకి వెళితే..జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్-51 నుంచి ఈ నెల 14న రాత్రి ఎర్రగడ్డకు చెందిన ఓ బాలుడు(17) కియా కారును అదుపుతప్పిన వేగంతో స్టీల్ బ్రిడ్జి వైపు వెళ్తూ గోడను ఢీకొట్టాడు. పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా కారు నడిపిస్తున్నట్లుగా గుర్తించారు. దీంతో సదరు బాలుడి తండ్రి భజరంగ్ అగర్వాల్‌పై కూడా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి మొక్కలు సాగు చేసిన వ్యక్తి రిమాండ్

శంకర్‌పల్లి: గంజాయి మొక్కలు సాగు చేసిన వ్యక్తిని అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించామని శంకర్‌పల్లి ఎస్‌ఐ సంతోష్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ఎల్వర్తి గ్రామానికి చెందిన తలారి ప్రేమ్‌ప్రసాద్ ఇంటి దగ్గర గంజాయి మొక్కలు పెంచుతున్నాడన్న సమాచారంతో అక్కడికి వెళ్లి పోలీసులు సోదాలు చేశారు. ఈ దాడుల్లో గంజాయి మొక్కలు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించారు.

పర్యాటక క్షేత్రంగా జేపీదర్గా

- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హామీ
- ప్రారంభమైన ఉర్సు

కొత్తూరు: మండలంలోని ఇన్ముల్‌నర్వ గ్రామంలోని జేపీదర్గా ఉర్సు ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా వక్ఫ్‌బోర్డు ఆధ్వర్యంలో గంధోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, వక్ఫ్‌బోర్డు అధికారులతో కలిసి బాబాకు గంధం సమర్పించి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రసిద్ధి గాంచిన జేపీదర్గాను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు. గత ప్రభుత్వం దర్గా అభివృద్ధిని పూర్తిగా విస్మరించిందన్నారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం దర్గా ఆవరణలో భక్తులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేకపోయిందని విమర్శించారు. తమ ప్రభుత్వంలో దర్గాను అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. బాబా దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వారికి



బాబాకు గంధం సమర్పించడానికి ప్రార్థనలు చేస్తున్న వక్ఫ్‌బోర్డు అధికారులు, ఎమ్మెల్యే వీర్లపల్లి



అన్ని రకాల సౌకర్యాలు, వసతులు కల్పించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఎంపీపీ మధుసూదన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ శ్యాంసుందర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు అధికారులు అమీర్ అహ్మద్, సత్తార్, శివశంకర్‌గౌడ్, ఖాజా, ఖాలేద్, బాబర్‌ఖాన్, రఘు, సిరాజ్, రషీద్ పాల్గొన్నారు.

పాత కాపులకే పగ్గాలు

బీజేపీ జిల్లా అధ్యక్షులుగా మళ్లీ వారే..

సాక్షి, సిటీబ్యూరో: బీజేపీ జిల్లా అధ్యక్షులుగా మళ్లీ పాత వారినే నియమించింది. ఈ మేరకు పార్టీ అధిష్టానం గురువారం రాత్రి అధ్యక్షుల జాబితాను వెల్లడించింది. భాగ్యనగర్ మలక్‌పేట్ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.సురేందర్ రెడ్డిని నియమించగా, గోల్కొండ గోషామహల్ అధ్యక్షుడిగా వి.పాండు యాదవ్‌ను నియమించింది. హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడిగా ఎస్.గౌతంరావు, మహంకాళి సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడిగా బి.శ్యాంసుందర్‌గౌడ్, రంగారెడ్డి అర్బన్ అధ్యక్షుడిగా సామ రంగారెడ్డిని, రూరల్ అధ్యక్షునిగా బొక్క నర్సింహారెడ్డి, మేడ్చల్ అర్బన్ అధ్యక్షుడిగా పి.హరీష్‌రెడ్డి, రూరల్ అధ్యక్షునిగా విక్రం రెడ్డిని నియమించింది. మరికొద్ది రోజుల్లో లోక్‌సభకు ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో మళ్లీ పాత వారికే పార్టీ పగ్గాలు అప్పజెప్పడం విశేషం.

బాలికపై కత్తితో బాలుడి దాడి

అంబర్‌పేట: ప్రేమ పేరుతో ఓ బాలికను వేధిస్తున్న ఓ బాలుడు ఆమెపై కత్తితో దాడికి పాల్పడిన సంఘటన అంబర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బాగ్ అంబర్‌పేట మల్లికార్జున నగర్‌కు చెందిన బాలుడు, తురాబ్‌నగర్‌కు చెందిన బాలిక గత సంవత్సరం ఒకే పాఠశాలలో పదో తరగతి చదువుకున్నారు. ప్రస్తుతం వేర్వేరు కళాశాలల్లో ఇంటర్మీడియట్ చదువుతున్నారు. సదరు బాలుడు కొన్నాళ్లుగా ప్రేమ పేరుతో ఆమెను వేధిస్తున్నాడు. అందుకు ఆమె అంగీకరించకపోవడంతో కోపం పెంచుకున్న అతను గురువారం రాత్రి నేరుగా బాలిక ఇంటికి వెళ్ళాడు. ఆమెతో మాట్లాడాలని బయటికి పిలిచి కత్తితో దాడి చేశాడు. అప్రమత్తమైన తల్లిదండ్రులు తేరుకునే లోపే అక్కడి నుంచి పరారయ్యాడు. బాలికకు కడుపులో తీవ్ర గాయం కావడంతో కుటుంబసభ్యులు ఆమెను సమీపంలో ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు పరారీలో ఉన్న బాలుడి కోసం గాలిస్తున్నారు. ప్రస్తుతం బాధితురాలి పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.

క్రషర్లపై మట్టి మాఫియా దౌర్జన్యం!

- రోడ్డుకు అడ్డంగా టిప్పర్ నిలిపి పరార్
- ఇబ్బందులు పడిన వాహనదారులు
- ఆందోళన వ్యకం చేస్తున్న యజమానులు



రోడ్డుపై నిలిచిపోయిన టిప్పర్లు

అబ్దుల్లాపూర్‌మెట్: మైనింగ్ జోన్‌లోని పలు క్రషర్లపై మట్టి మాఫియా దౌర్జన్యం చేస్తున్న ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ భూముల్లోని మట్టిని అక్రమంగా తవ్వుకుంటున్న మాఫియా వాహనాలను క్రషర్ల గుండా వెళ్లొదని, వాటితో ప్రభుత్వాధికారుల నుంచి తమకు ఒత్తిళ్లు వస్తున్నాయని క్రషర్ల యజమానులు మట్టి మాఫియాకు సూచించడంతో ఇద్దరి మధ్య కొన్ని రోజులుగా సాగిన వివాదం గురువారం రాత్రి ముదిరింది. దీంతో మట్టి మాఫియా ముఠాకు చెందిన వ్యక్తులు క్రషర్లకు కంకర తీసుకువచ్చే టిప్పర్లను వెళ్లనీయకుండా రోడ్డుకు అడ్డంగా తమ లారీని నిలిపి అక్కడి నుంచి పరారైన ఘటన అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బండరావిరాల మైనింగ్‌జోన్ పరిధి సద్దుపల్లి రెవెన్యూ పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు, టిప్పర్ల యజమానులు తెలిపిన వివరాల ప్రకారం.. బండరావిరాల మైనింగ్ జోన్ సర్వేనంబర్ 268లోని భూమితో(గ్రీన్‌బెల్టు) పాటు ప్రభుత్వ భూముల్లో సద్దుపల్లి గ్రామానికి చెందిన పలువురు వ్యక్తులు, చిన్నరావిరాల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ముఠాగా ఏర్పడి గుట్టుచప్పుడు కాకుండా రాత్రి సమయాల్లో వందలాది టిప్పర్లలో అక్రమంగా మట్టిని తరలిస్తున్నారు. మాఫియాకు చెందిన టిప్పర్లు సమీపంలోని క్రషర్ల గుండా బయటకు వస్తున్నాయి. మట్టిని తీసుకువస్తున్న టిప్పర్లు క్రషర్ల గుండా వస్తుండడంతో స్థానికుల ఫిర్యాదు మేరకు పలుమార్లు అధికారులు ఆయా క్రషర్ల యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు. దీంతో తమ క్రషర్ల గుండా మట్టితో కూడిన టిప్పర్ల రాకపోకలు నిలిపి వేయాలని యజమానులు మాఫియా ముఠాకు సూచించారు. దీనికి ఆగ్రహించిన మట్టి మాఫియా క్రషర్ల నుంచి కంకరను తీసుకువచ్చే టిప్పర్లు రాకుండా రోడ్డుకు అడ్డంగా తమ వాహనాలను నిలిపి వెళ్లిపోయారు. దీంతో రోడ్డపై రాకపోకలకు ఇబ్బంది కలగడంతో ఇరువైపులా టిప్పర్లు బారులు తీరాయి. క్రషర్ల యజమానులు, మట్టి మాఫియా మధ్య జరుగుతున్న గొడవల కారణంగా తమ బతుకుదెరువు పోతుందని టిప్పర్ల డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

షాద్‌నగర్‌రూరల్: గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన గురువారం వెలుగు చూసింది. ఏఎస్‌ఐ రాచందర్ తెలిపిన ప్రకారం.. సోలీపూర్ గ్రామ పరిధిలోని జాతీయ రహదారి సమీపంలో స్థానికులకు గుర్తు తెలియని వ్యక్తి(48) మృతదేహం కనిపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న ఏఎస్‌ఐ రాంచందర్ ఘటనా స్థలికి చేరుకుని పరిశీలించారు. వివరాలు తెలియలేదని.. మృతుడు భిక్షాటన చేస్తూ జీవించే వ్యక్తిగా కనిపిస్తున్నాడని, ఆకలి బాధతో చనిపోయి ఉంటాడని పోలీసులు భావిస్తున్నారు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి ఆచూకీ తెలిసినా, వివరాలు లభించినా షాద్‌నగర్ పీఎస్‌లో సంప్రదించాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

సైకిల్‌లో ఇరుక్కుని దివ్యాంగుడి మృతి

జీడిమెట్ల: ఓ దివ్యాంగుడు తాను ప్రయాణించే మూడు చక్రాల సైకిల్‌లో ఇరుక్కుని మృతిచెందిన సంఘటన జీడిమెట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అంజనేయులు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి.. గాజులరామారం డివిజన్ చంద్రగిరినగర్‌కు చెందిన యాదగిరి(62) దివ్యాంగుడు. అతను రోజూ షాపూర్‌నగర్‌లోని ఈఎస్‌ఐ ఆస్పత్రి వద్ద మాస్కులు, నోట్‌బుక్స్, పెన్నులు చిల్లర వస్తువులు విక్రయించేవాడు. బుధవారం రాత్రి సైకిల్‌పై కూర్చుని మద్యం తాగి అతను ప్రమాదవశాత్తు బండిపై నుంచి తూలి కింద పడి చక్రాల్లో ఇరుక్కున్నాడు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

సైన్స్ టాలెంట్ టెస్టుతో సృజనాత్మకత



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

షాద్‌నగర్‌రూరల్: శాస్త్రీయ ఆలోచనలను కలిగించే సైన్స్ టాలెంట్ టెస్టులను ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని జియోన్ పాఠశాలలో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో సైన్స్ టాలెంట్ టెస్టు పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. సైన్స్ టాలెంట్ టెస్టులు విద్యార్థుల మేధోశక్తిని పెంపొందిస్తాయన్నారు. ప్రతి విద్యార్థి శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకోవాలన్నారు. మెరుగైన ఆలోచనలు, పరిశీలన, ఆసక్తిని రేకెత్తించడానికి వైజ్ఞానిక పరీక్షలు ఎంతో దోహదపడుతాయన్నారు. ఈ నెల 19న పాఠశాల స్థాయిలో, 27న మండల, ఫిబ్రవరి 3న జిల్లా స్థాయిలో నిర్వహిస్తామన్నారు. ఈ పోటీల్లో విద్యార్థులు పాల్గొని ప్రతిభను చాటాలన్నారు. కార్యక్రమంలో జేవీవీ డివిజన్ అధ్యక్షుడు కుర్మయ్య, ప్రధాన కార్యదర్శి నర్సింలు, ఉపాధ్యాయులు శ్రీనివాస్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాల పరిశీలన



అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

- జల్‌పల్లిలో అధికారుల పర్యటన
- ఇళ్ల కూల్చివేతపై సందిగ్ధం
- క్రమబద్ధీకరణకు అవకాశం ఇవ్వాలంటున్న స్థానికులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి గ్రామంలోని 223 సర్వే నంబర్ ప్రభుత్వ భూమిలో వెలిసిన అక్రమ నిర్మాణాలను గుర్తించేందుకు అధికార యంత్రాంగం రంగంలోకి దిగింది. మహేశ్వరం ఆర్డీవో సూరజ్ కుమార్, డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, నీటి పారుదల శాఖ డీఈ దూద్యానాయక్, బాలాపూర్ తహసీల్దార్ మాధవీరెడ్డి, జల్‌పల్లి మున్సిపాలిటీ కమిషనర్ వసంత, పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, ఎస్సై భాస్కర్, ఇరిగేషన్ ఇన్‌స్పెక్టర్ జనార్దన్‌లు గురువారం చెరువు కట్ట కింద వెలిసిన అక్రమ నిర్మాణాలను పరిశీలించారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో అధికారులు విధుల్లో బిజీగా ఉన్న సమయంలో.. పెద్ద ఎత్తున అక్రమ నిర్మాణాలు వెలవడంపై ఫిర్యాదులు రావడంతో అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలనకు దిగారు. కొందరు స్థానిక నాయకులు ఇష్టానుసారంగా పేదల నుంచి డబ్బులు వసూలు చేసి, అన్ని తాము చూసుకుంటామని చెప్పడంతో రేకుల ఇళ్లను నిర్మించుకున్నారు. ఈ ఇళ్ల జాబితాను సేకరించిన అధికారులు కలెక్టర్‌కు అందజేయనున్నారు. ఇళ్ల కూల్చివేత సందర్భంగా తీసుకోవాల్సిన బందోబస్తు విషయమై కూడా ఈ సందర్భంగా డీసీపీ చర్చలు జరిపారు. ఇదిలా ఉండగా పేదలు కట్టుకున్న ఇళ్లనే కూల్చివేస్తారా.. పేదల నుంచి డబ్బులు తీసుకున్న అన్ని పార్టీల నాయకులపై కూడా చర్యలు తీసుకుంటారా..? అనే విషయాలు తేలాల్సి ఉంది. గతంలో 58, 59 జీవోల మాదిరిగా తమకు కూడా ఒక్క అవకాశం ఇవ్వాలని ఇళ్లు కట్టుకున్న పేదలు నూతన ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

ఆధార్ అప్‌డేట్‌కు ఇదీ 'వరుస'



టోకెన్ల కోసం చెప్పుల క్యూ

యాచారం: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల అర్హత కోసం ఆధార్ తప్పనిసరి. ఏళ్ల క్రితం నమోదు చేసుకున్న లబ్ధిదారులకు ప్రస్తుతం అప్‌డేట్ లేదు. ప్రస్తుతం అప్‌డేట్ ఉన్నవారికి మాత్రమే రేషన్ సరుకులు అందుతున్నాయి. ఆధార్ నంబర్ తీసుకున్న చిన్నారులకు అప్పట్లో బయోమెట్రిక్ లేదు. దీంతో ప్రస్తుతం వారంతా బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం ఆధార్ కేంద్రాల వద్ద క్యూ కడుతున్నారు. మండల కేంద్రంలో ఉన్న రెండు ఆధార్ సెంటర్లకు మండల పరిధిలోని గ్రామాలతో పాటు మంచాల, కందుకూరు, మాడ్గుల, ఇబ్రహీంపట్నం, నల్లగొండ జిల్లాలోని చింతపల్లి, మర్రిగూడ మండలాల ప్రజలు సైతం వస్తున్నారు. ఉదయం 4గంటల నుంచే ఆధార్ సెంటర్ల వద్దకు వచ్చి చెప్పులను క్యూలో పెడుతున్నారు. ఆ క్యూ ఆధారంగా సెంటర్ నిర్వాహకులు వారికి టోకెన్లు ఇచ్చి అప్‌డేట్‌కు వివరాలు సేకరిస్తున్నారు. ఈ కేంద్రాలకు నిత్యం ఐదు వందల మందికి పైగా వస్తున్నారు.

ఏటీఎంలో చోరీకి యత్నం



ఆధారాలు సేకరిస్తున్న డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజు

కుత్బుల్లాపూర్: దూలపల్లి రోడ్డులో ఉన్న పంజాబ్ నేషనల్ బ్యాంకు(పీఎన్‌బీ) ఏటీఎంలో ఓ వ్యక్తి చోరీకి యత్నించిన సంఘటన గురువారం తెల్లవారుజామున పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాజు కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గురువారం ఏటీఎంలోకి ప్రవేశించిన ఓ వ్యక్తి నగదు కోసం ఎంత ప్రయత్నించినా లాకర్ తెరుచుకోకపోవడంతో అక్కడ ఉన్న వస్తువులను పగలగొట్టి వెళ్లిపోయాడు. పీఎన్‌బీ కొంపల్లి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ హర్షియా ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

- ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్సే చేయాలి
- డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి



ఓ ఆస్పత్రి వద్ద తనిఖీలు చేస్తున్న డాక్టర్ జయలక్ష్మి, ఇతర సిబ్బంది

కొత్తూరు: అనారోగ్యాంతో వచ్చే ప్రజలకు ఆర్‌ఎంపీలు, పీఎంపీలు కేవలం ప్రథమ చికిత్సలు మాత్రమే నిర్వహించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి హెచ్చరించారు. కొత్తూరు పట్టణంలో పలు ఆస్పత్రులు, క్లీనిక్‌లలో గురువారం ఆమె వైద్య సిబ్బందితో కలిసి ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. సరైన అనుమతులు లేని, గడువు ముగిసిన మందులు విక్రయిస్తున్న పలు క్లీనిక్‌లను సీజ్ చేశారు. విషయం తెలుసుకున్న పలువురు ఆర్‌ఎంపీలు ముందస్తుగానే కేంద్రాలను మూసివేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వైద్యం కోసం వచ్చే వారికి ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్సలు నిర్వహించి మెరుగైన వైద్యం కోసం పెద్ద ఆస్పత్రులకు రిఫర్ చేయాలన్నారు. చికిత్సలు నిర్వహించే కేంద్రాలకు క్లీనిక్ అని కాకుండా ప్రథమ చికిత్స కేంద్రాలు అని రాయించుకోవాలి సూచించారు. పలువురు ఆర్‌ఎంపీలు వైద్యం కోసం వచ్చే వారికి ఇంజెక్షన్లు ఇవ్వడంతో పాటు సొంతంగా మందులు ఇస్తున్నట్లు గుర్తించామన్నారు. కొన్ని క్లీనిక్‌లలో అనుమతులు లేని మెడికల్ షాపులు నిర్వహించడంతో పాటు నిపుణులు సైతం లేకుండానే మందులు విక్రయిస్తున్నట్లు వివరించారు. మరికొన్ని వాటిలో మెడికల్ షాపుల లైసెన్స్ గడువులు సైతం ముగిసినట్లు తెలిపారు. దీంతో సాయిబాబా, జహంగీర్ క్లీనిక్‌లను తాత్కాలికంగా సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. దాడుల్లో స్థానిక పీహెచ్‌సీ వైద్యుడు హరికిషన్, ఇతర వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.